

నేటి ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎస్ఇ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాలలో కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసులురెడ్డి, నాయకులు నాగసుబ్బయ్య, హరి పిలుపునిచ్చారు. ఆదివారం కడప సిఐటియు నగర కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు కార్యాలయాల వద్ద జరిగే ధర్నాల్లో కడప, అన్నమయ్య జిల్లాలోని, సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, వాచ్‌మెన్లు, మీటర్ రీడర్స్, అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణాలోలా డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలని పేర్కొన్నారు. స్కిల్డ్ కార్మికులకు నెలకు రూ. 43,162 చెల్లించాలని డిమాండ్ చేశారు. అందర్నీ పర్మినెంట్ చేయాలన్నారు. సమావేశంలో సురేంద్ర, ఎరికలరెడ్డి, శివకుమార్ ,నాగమల్లయ్య, వెంకటేష్, షరీఫ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పతనం తప్పదు

అంగన్వాడీల సమ్మెకు టిడిపి, ప్రజాసంఘాల నాయకుల సంఘీభావం



కడప : అంగన్వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాబోయే రోజుల్లో ప్రభుత్వ పతనం తప్పదని తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి. వి.ఎస్. అమీర్ బాబు, సీనియర్ నాయకులు ఆలంఖాన్ పల్లి లక్ష్మిరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ 6 రోజులుగా చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బందికి పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీతో పాటు సుప్రీంకోర్టు సూచించినట్లు కనీస వేతనాలు అంగన్వాడీ వర్కర్లకు రూ. 26వేలు, హెల్పర్లకు రూ. 20వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే ఎన్నికల్లో అంగన్వాడీల ఆగ్రహానికి ప్రభుత్వం గురి కాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రామ మోహన్, టిడిపి నాయకులు, పాలకొండ మాజీ చైర్మన్ ఓబుల్ రెడ్డి, అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు. **చాపాడు :** స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం అంగన్వాడీ కార్యకర్తలు మైదుకూరు - ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ నాయకులు సుజాత, మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన కోరికలను పరిష్కరించడంలో విఫలమై ందన్నారు. 6 రోజులుగా ధర్నా చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలన్నారు. మానవహారంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో ఎస్ఐ మైనుద్దీన్ అంగన్వాడీ కార్యకర్తలతో మాట్లాడి నిరసన విరమింపజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, విజయ లక్ష్మి, ఆదిలక్ష్మి, రాధ, ఆయాలు పాల్గొన్నారు. **మైదుకూరు:** అంగన్వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వ పతనం తప్పదని యుటిఎఫ్ నాయకులు హెచ్చరించారు. అంగన్వాడీ కార్మికులు ఎంపిడిఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 6వ రోజుకు చేరుకుంది. ముందుగా ప్రమాదంలో మరణించిన టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, రవికుమార్ మాట్లాడుతూ షేక్ సాబ్జి ఉద్యమ స్ఫూర్తితో పోరాడుతామని, అంగన్వాడీ సమస్యల ఉద్యమంపై ప్రభుత్వ అణిచివేత ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. యుటిఎఫ్ మండల నాయకులు వి.రాము, సిడి బాష, రమణారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గండి సునీల్, సిఐటియు భాస్కర్, వెంకట సుబ్బమ్మ, ధనలక్ష్మి, వేదమ్మ, ఎఐటియుసి నాయకులు చిన్నమ్మ, రిజ్వానా నాయకులు శ్రీరాములు, వీరయ్య, భాస్కర్ పాల్గొన్నారు. **బ్రహ్మంగారిమఠం :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. ముందుగా ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాహుల్, సిపిఎం మండల నాయకులు నాయకులు భాస్కర్ పాల్గొన్నారు. **బద్వేలు :** స్థానిక బద్వేలు సమగ్ర శిశు అభివృద్ధి అధికారిని కార్యాలయం వద్ద అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో 6 రోజు రాష్ట్రవ్యాప్త సమ్మె లో భాగంగా కళ్ళకు గంతలు కట్టుకొని తమ నిరసనను తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఆర్.హుసేనమ్మ సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.



మైదుకూరు : ఎమ్మెల్సీ సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంగన్వాడీలు



చాపాడు : నినాదాలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

'సూపర్' కల సాకారం



జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రి కొత్తరూపు సంతరించుకుంది. ఎన్నో దశాబ్దాల జిల్లా వాసుల కలయైన సూపర్‌స్పెషాలిటీ సేవలు సాకారం కానున్నాయి. ఎపిఎంఐడిసి ఇంజినీరింగ్ యంత్రాంగం రూ.419 కోట్లతో కూడిన కేన్సర్‌కేర్, సైక్రియాటిక్ సేవలకు అవసర మైన బ్లాకుల నిర్మాణ పనుల్నీ పరుగులు పెట్టిస్తోంది. ఇందుకు అనుగుణంగా ఈనెల 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడానికి అవసరమైన సన్నాహాలను వేగవంతం చేసింది. ఇందులోభాగంగా మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. సిమెంటు, తారురోడ్ల నిర్మాణాలు, విద్యుత్ సదుపాయం, తాగునీరు, పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు పనులను రాత్రింభ వళ్లనే తీరిక లేకుండా యుద్ధప్రాతిపదికన చేపట్టింది.

- రూ.419 కోట్లతో జిజిహెచ్ బ్లాకులు పూర్తి
- శరవేగంగా మౌలిక వసతుల కల్పనలో ఎపిఎంఐడిసి
- 23న సిఎం వైఎస్ జగన్‌చే ప్రారంభోత్సవానికి సన్నాహాలు



పనులు పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎట్టకేలకు జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలకు సిద్ధమైంది. దేశంలోని మహానగరాలకు పరిమితమైన సూపర్‌స్పెషా లిటీ సేవల దగ్గర నుంచి మానసిక, కేన్సర్ వంటి ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి రానున్నాయి. దశాబ్దాల తరబడి ఎదురు చూసిన సూపర్‌స్పెషాలిటీ సేవల కల సాకారం కానుండడం హర్షా తిరేకాలను కలిగిస్తోంది. ఐదేళ్ల కిందటి వరకు చిన్నపాటి డెంగీ జ్వరం చికిత్సకు తిరుపతి, కర్నూలు, చెన్నయ్, హైదరాబాద్ నగరాలకు పరుగులు తీయడం తెలిసిందే. ఇటీవల జిజిహెచ్‌లో డెంగీ ప్లేట్‌లెట్స్ ఎక్కించుకునే పరికరం అందుబాటులోకి రావడంతో ఉపశమనం లభించింది. ఇటువంటి తరహా అనేక వ్యాధులకు మహానగరాలకు పరుగులు తీయడం పరిపాటిగా మారిన నేపథ్యంలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కానీ నిష్ణాతులైన వైద్య నిపుణులు, ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల లభ్యతపై నెల కొన్న సందేహాలను అధిగమించాల్సి ఉంది.

శరవేగంగా బ్లాకులు

2019 డిసెంబర్‌లో ముఖ్యమంత్రి హోదాలో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జిజిహెచ్ ఆవరణంలో రూ.272 కోట్లతో సూపర్ స్పెషాలిటీ, రూ.107 కోట్లతో కేన్సర్ కేర్, రూ.40.81 కోట్లతో సైక్రియాటిక్ బ్లాకుల నిర్మాణాలను బ్లాకులకు శంకుస్థాపన చేశారు. ఈమేరకు ఎపిఎంఐడిసి టెండర్లు పిలిచింది. తెలంగాణాకు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ బిపిఆర్ కాంట్రాక్టు సంస్థ టెండరు దక్కించుకుంది. అనంతరం ఎపిఎంఐడిసి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆశయాన్ని పట్టాలెక్కించే కసరత్తును వేగవంతం చేసింది. నాలుగున్నరేళ్లకుపైగా శ్రమించింది. మధ్యలో కరోనా మహమ్మారి విజృంభణ, బిల్లుల చెల్లింపులు వంటి అడ్డంకులను అధిగమించింది.సూపర్‌స్పెషాలిటీ, సైక్రియాటిక్, కేన్స ర్‌కేర్ బ్లాకుల నిర్మాణాలను పూర్తి చేసింది. కరోనా వంటి అనేక అడ్డంకులను అధి గమించింది. ఇందులో ఎపిఎంఐడిసి పట్టువదలని కృషి దాగి ఉందని చెప్పవచ్చు.

యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు

ఈనెల 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిచే ప్రారంభించనున్న సూపర్‌స్పెషాలిటీ, సైక్రియాటిక్, కేన్సర్‌కేర్ బ్లాకుల రహదారుల పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. సుమారు రూ.4 కోట్లతో కూడిన పనుల్ని తెలంగాణా ప్రాంతానికి చెందిన గౌరీశంకర్ కాంట్రాక్టు సంస్థ టెండరు దక్కించుకుంది. టెండరు మొదలుకుని రాత్రింభవళ్లనే తేడా లేకుండా రహదారి పనుల్ని ముమ్మరం చేసింది. ఎపి ఎంఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్లు బ్లాకుల వారీగా పనుల్ని విభజించుకుని పర్య వేక్షిస్తున్నారు. ఇందులో కేన్సర్, సైక్రియాటిక్ బ్లాకుల దగ్గర రహదారి పనుల్ని ఎగ్జి క్యూటివ్ ఇంజినీర్, సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ రహదారి నిర్మాణ పనుల్ని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్లు పర్య వేక్షి స్తున్నారు. రాత్రింబవళ్లనే తేడా లేకుండా అలుపెరగని కృషి చేస్తుండడం గమనార్హం.

ఫ్లడ్‌లైట్ల వెలుగులో...

ఎపిఎంఐడిసి రహదారి నిర్మాణాలను ఫ్లడ్‌లైట్ల వెలుగులో యుద్ధప్రాతిపదికన సాగిస్తోంది. రహదారుల స్థలాల్ని చదును చేయడం దగ్గర నుంచి రహదారులకు మార్కింగ్, లైటింగ్ వ్యవస్థలు, కూ డళ్లు, సిమెంటు, తారు, మట్టి రోడ్డు నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అనంతరం పార్కింగ్ స్థలాలను, పచ్చిక పెంచే ప్రదేశాలను ఎంపిక చేసుకుని అభివృద్ధి పరిచే పనుల్లో నిమగ్నమైంది.వీటితోపాటు మూడు బ్లాకుల పరిధిలో విద్యుత్ సదు పాయాల కల్పన, ఎలక్ట్రిఫికేషన్, రహదారుల డివైడర్లు ఏర్పాటు చేయడం, తాగు నీటి వసతుల కల్పన వంటి పనుల్ని రాత్రింబవళ్లు పర్యవేక్షిస్తుండడం గమనార్హం.



సిమెంట్ రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న ఎఇ జి.కె. బాషా



సమావేశంలో మాట్లాడుతున్న సత్తార్

కడప నగరం అస్తవ్యస్తం : అఖిలపక్షం

కడప : ప్రజా ప్రతినిధులు అధికారులు కడప నగరాన్ని అభివృద్ధి పేరుతో అస్తవ్యస్తంగా మారుస్తున్నారని అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. ఏ. సత్తార్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. 'కడప నగర అభివృద్ధికి రూ.2,100 కోట్లు మంజూరు అయ్యాయని, జరుగుతున్న అభివృద్ధి 'మీ కళ్ళకు కనపడలేదా 'అంటూ కడప ఎమ్మెల్యే అంజాద్ బాషా సోషల్ మీడియాలో తీవ్రంగా ప్రశ్నించారు అన్నారు. కానీ కడప అభివృద్ధి మేడిపండు లాంటిదని వక్తలు విమర్శించారు. అభివృద్ధి గురించి ఎవరైనా ప్రశ్నించినప్పుడు ఆవేశాలకు తావివ్వకుండా వివరించాలన్నారు. కడప నగరంలో రోడ్ల వెడల్పు, కూడళ్లు, డ్రెయినేజీ అభివృద్ధి చేయడం అనేది మేడిపండు లాగా ఉందని ఆరోపించారు. ప్రధాన రోడ్లు ప్రధాన కోడళ్ళు అభివృద్ధి మాత్రమే అభివృద్ధి కాదు, నగరంలోని 50 డివిజన్లు అందులోని 250 వెనుకబడిన ప్రాంతాలున్నాయని, అవీ కడప నగరంలోనే భాగమే అన్నారు. క్రిస్మస్ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడళ్లు ప్రారంభించాలనే ఉద్దేశంలో పనులు ఆర్భాటంగా చేపడుతున్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా ఒత్తిడి చేసి మరీ పనులు చేస్తున్నారు అన్నారు. సమావేశంలో భూ పోరాట కమిటీ నాయకులు బి నారాయణ రెడ్డి, అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సిఆర్‌వి ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి గురప్ప ,ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి ,ఎస్‌డిపిఐ పార్టీ జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా, ఎం.ఆర్.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి, లోక్ సత్తా పార్టీ నాయకులు దేవర కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్యామలాదేవి పాల్గొని ప్రసంగించారు.

గత వైభవాన్ని తలపించేలా 'మహాసభలు'

కడప అర్బన్ : జిల్లాలో గతంలో నిర్వహించిన మహాసభలు తలపించేలా 36 ఏళ్ల తరువాత ఈనెల 23,24 తేదీలలో కడప సభాభవనంలో రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సంఘం గౌరవాధ్యకక్షులు షేక్. హుస్సేన్ సత్యాగ్ని అన్నారు. ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ హుస్సేన్ మాట్లాడుతూ గతంలో మహా సభలు నిర్వహించినప్పుడు ఇతర ప్రాంతాల నుంచి మహాకవులను, రచయితలను కడప గడపకు ఆహ్వానించారని చెప్పారు. సంఘం అధ్యకక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రాచీన కవులు మొదలుకొని ఆధునిక కవుల వరకు తెలుగు భాషా సాహిత్యాలకు కడపజిల్లా ఎనలేని సేవ చేశారన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యకక్షులు అలపర్తి పిచ్చయ్యచౌదరి, కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యకక్షులు డా.చింతకుంట శివారెడ్డి, కోశాధికారి కొప్పోలు రెడ్డి శేఖరరెడ్డి, కార్యవర్గ సభ్యులు వెల్లాల వెంకటేశ్వరాచారి, పాలెం వేణుగోపాల్, జి.వి.సాయిప్రసాద్, .అనుగూరు చంద్రశేఖరరెడ్డి, భూమిరెడ్డి స్వరూపరాణి, ఎస్.రాజగోపాలరెడ్డి, సురేష్‌బాబు, డా.పొదిలి నాగరాజు, స్వతంత్రబాబు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సమస్యల పరిష్కారానికి పెద్దపీట

- ఏటా రూ.514 కోట్లు చెల్లింపులు
- మూడు సబ్‌ట్రెజరీలకు ప్రతిపాదనలు
- ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలి
- ట్రెజరీ డిడి ఎం.ఎస్ వెంకటేశ్వర్లు వెల్లడి



జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయం. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి ఉద్యోగీ ఇకెవైసి చేయించుకోవాలి. దీనికితోడు జిల్లాలోని డ్రాయింగ్ ఆఫీసర్లు తమ శాఖల పరిధిలోని అకౌంట్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. సిఎఫ్ఎంఎస్ అమలు నేపథ్యంలో ట్రెజరీ అధికారులపై అదనపు భారం పడింది. ఎపిఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు ట్రెజరీ పరిధిలోకి వచ్చింది. వైద్య ఆరోగ్యశాఖ కూడా ప్రభుత్వ పరిధిలో రానున్న నేపథ్యంలో మరింత భారంగా మారే అవకాశం కనిపిస్తోందని పేర్కొంటున్న ట్రెజరీస్ డిడి ఎం. ఎస్ వెంకటేశ్వర్లుతో ముఖాముఖీ...

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ముఖా ముఖి..

జిల్లాలోని సబ్‌ట్రెజరీ కార్యాలయాలెన్ని?

జిల్లాలో తొమ్మిది సబ్‌ట్రెజరీ కార్యాలయాలున్నాయి. కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, ముద్దనూరు, కమలాపురం, పులి వెందుల, బద్వేల్, సిద్ధవటం, ప్రాంతాల్లో ఉన్నాయి.

ట్రెజరీ కార్యాలయాల పనులేమిటి?

జిల్లాలోని ట్రెజరీ కార్యాలయాలు ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లు చెల్లింపులు, వాటి రికార్డులను నిర్వహించడం, కొత్తగా చేరిన ఉద్యోగులకు ఐడి, ఇతర రికార్డులను నిర్వహించడం, పీడీ అకౌంట్ల నిర్వహణ, స్ట్రాంగ్‌రూమ్ నిర్వహణ, ఆప్కోస్, కాంట్రాక్టు, క్లాస్- 4 ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుంది.

ఇకెవైసి నమోదు ఎలా ఉంది?

జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా ఇకెవైసిపి చేయించుకోవాలి. ఇప్పటివరకు ఉద్యోగులు 99 శాతం, పెన్షనర్స్ 99 శాతం నమోదు చేశాం.

ప్రభుత్వ ఉద్యోగుల వివరాలు తెలపండి?

జిల్లాలో 22 వేల మంది ఉద్యోగులు, 18 వేల మంది పెన్షనర్స్ ఉన్నారు. ప్రతి నెలా సదరు ఉద్యోగుల జీతభత్యాల, పెన్షన్స్, వంటి ఇతర చెల్లింపులు ప్రక్రియ నడుస్తోంది. వీటితోపాటు రిటైర్డు ఉద్యోగుల బకాయిలు, గ్రాట్యూటీ చెల్లింపులను చేయడం గమనార్హం.

ట్రెజరీ చెల్లింపుల గురించి తెలపండి?

ప్రతిఏటా ట్రెజరీశాఖ ద్వారా రూ.514 కోట్లు మేర ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనర్లకు సంబంధించి పెన్షన్ల రూపంలో చెల్లింపులు చేయడం జరుగుతోంది.

పీడీ అకౌంట్లు కలిగిన డిపార్టుమెంట్లు ఎన్ని?

జిల్లాలో 10 శాఖల వరకు ఉన్నారు. ఇందులో వైద్య ఆరోగ్య శాఖ, డ్వామా, స్పోర్ట్స్‌స్కూల్, యూనివర్శిటీ, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ సహా ఇతర శాఖల పరిధిలోని ఉద్యోగులు ఉన్నారు. వీటి పరిధిలోని ఉద్యోగులకు పీడీ అకౌంట్ల ద్వారా జీతభత్యాలు చెల్లింపులు చేస్తున్నాం.

ఆప్కోస్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎంతమంది?

ఆప్కోస్ కింద 3,600 మంది, ఔట్‌సోర్సింగ్ కింద 1100, కాంట్రాక్టు ఉద్యోగులు 2,000 మంది వరకు ఉన్నారు.

సబ్‌ట్రెజరీ భవన నిర్మాణ పనుల గురించి చెప్పండి?

జిల్లాలో సిద్ధవటం, జమ్మలమడుగు, ముద్దనూరు సబ్‌ట్రెజరీ భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రతి సబ్‌ట్రెజరీ భవనానికి రూ.కోటి వ్యయంతో టెండర్లు పిలిచాం. కాంట్రాక్టర్లు ముందుకు వచ్చిన వెంటనే పనులు చేపడతాం.

ఆన్‌లైన్ నమోదు ఎంతవరకు వచ్చింది?

జిల్లాలోని ప్రభుత్వశాఖల అకౌంట్లను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ మధ్యస్థంగా సాగుతోంది. జిల్లాలోని 1200 మంది డ్రాయింగ్ ఆఫీసర్లు వేగం పెంచాలి.రాబోయే వీడియో కాన్ఫరెన్స్ సమయానికి ఆశించిన పురోగతిని చూపించాల్సిన అవసరం ఉంది.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

కడప అర్బన్ : జిల్లా ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. సమావేశంలో కడప ఉపఖజాన అధికారి రవికుమార్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు జాతినిర్మాణ సారథులని చెప్పారు. కడపలోని పెన్షనర్లకు ఎలాంటి సమస్యలు లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. సంఘ అధ్యక్షులు చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామమూర్తి నాయుడు 30 సంవత్సరాలుగా సంఘ అభివృద్ధి, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులను, పెన్షనర్స్‌ను మానసికంగా వేధించే ఏ ప్రభుత్వం ఎక్కువ కాలం మనజాలదని, వారి న్యాయమైన కోర్కెలు తీర్చడం ప్రభుత్వ నైతిక బాధ్యత అన్నారు. సంఘ గౌరవాధ్యక్షులు వెంకటరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగముని రెడ్డి, రాధాకృష్ణ, బాలయెల్లారెడ్డి నేతృత్వంలో 75 వసంతాలు పూర్తిచేసుకున్న 38 మంది పెన్షనర్స్ ను ఘనంగా సన్మానించారు. ముద్రా డ్యాన్స్ స్కూల్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో గానుగపెంట హనుమంతరావు, నారాయణ రెడ్డి, సుబ్బా రెడ్డి,చలపతి, నారాయణ, నాగయ్య, బద్వేల్ పెన్షనర్స్ సంఘ బాధ్యులు, ముద్దనూర్ సంఘ బాధ్యులు ,రాయల్ కరీముల్లా పాల్గొన్నారు

'అన్నమాచార్య'లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - చింతాకొమ్మదిన్నె



పూర్వ విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్

స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాత స్నేహితులందరూ మళ్లీ ఒకసారి కలుసుకోవడం చాలా ఆనందదాయకుని వారు పేర్కొన్నారు, ఇలాంటి అరుదైన అవకాశాన్ని కల్పించిన అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల అధినేత చొప్ప గంగిరెడ్డి ఆ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు, అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువును నేర్పించి, కర్తవ్య దీక్షను తమలో మేల్కొపి, సత్ఫలితాలలో సమాజంలో గౌరవ ప్రతిష్టలు పెరిగేలా చేశారన్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాల స్థాపించి దాదాపు 13 సంవత్సరాలయ్యాయని, పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడి ఇలా సమావేశం కావడం తమకెంతో సంతోషంగా ఉందని చెప్పారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమలు విశేషంగా ఆకట్టుకున్నాయి, కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషి చేసిన డాక్టర్ నాగేశ్వరరెడ్డిని విద్యార్థులు, అన్ని విభాగాధిపతుల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ప్రమాదంలో భారతదేశం : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప



సమావేశంలో మాట్లాడుతున్న అలీఖాన్

అసమర్థ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలనలో భారతదేశం పెను ప్రమాదంలో పడిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీఖాన్ విమర్శించారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఇవిఎంల అంకెల గారడీతో అధికారం చెలాయిస్తున్న మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం, లౌకికవాదం, శాంతి భద్రతలు, ఖూనీ చేస్తూ మత విద్వేష పరిపాలన కొనసాగిస్తుందని విమర్శించారు. ఇటీవల లోక్ సభలో కొందరు వ్యక్తులు జొరబడి, దేశ అత్యున్నత చట్టసభల విధులకు భంగం కలిగించడమేగాక సభ్యులను భయభ్రాంతులకు గురి చేయడం శోచనీ యమన్నారు. దేశంలో అధిక ధరలు దారిద్ర్యం, పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు, మహిళలపై అత్యాచారాలు, రైతుల ఆత్మహత్యలు వంటి భయానక సమస్యలను పరిష్కరించడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ముస్లిం మైనార్టీలపై దాడులు చేయిస్తూ, మతం పేరిట దళితులు, క్రైస్తవులను అంతమొందించేందుకు ఆర్ఎస్ఎస్ దాని మూక సంస్థలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. దుర్మార్గపు పరిపాలన కొనసాగిస్తున్న ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగమైన బిజెపి ప్రభుత్వాన్ని ప్రజలు బంగాళాఖాతంలో కలిపే సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో పిసిసి కార్యదర్శి మోపురి వెంకట రమణారెడ్డి, మాజీ కార్పొరేటర్ పాల్గొన్నారు.

బీమా భరోసా లాంటిది

ప్రజాశక్తి - కడప



ఎపి ఎన్ఆర్‌టిఎస్ ప్రవాసాంధ్ర భరోసా బీమా ప్రవాసాంధ్రుల కుటుంబ సభ్యులకు భరోసా లాంటిదని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవా సాంధ్రులు తప్పకుండా ప్రవాసాంధ్ర భరోసా బీమా నమోదు చేసుకోవాలని అధ్యక్షులు వెంకట్ మేడపాటి, డైరెక్టర్ బి.హెచ్. ఇలియాస్ అన్నారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. 2024 జనవరి 15 నుంచి ప్రవాసాంధ్ర భరోసా బీమా కొత్త పాలసీ వస్తుందని తెలిపారు. ప్రీమియం డబ్బులు పెరిగే అవకాశం ఉన్నందున ఇప్పుడున్న ప్రీమియం మూడు సంవత్సరాలకుగాను ఉద్యోగా వలస కార్మికులకు రూ.550, విద్యార్థులకు రూ.180 చెల్లించి నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నమోదు చేసుకున్న వారెవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా కంపెనీ ద్వారా చెల్లిస్తారన్నారు. ప్రమాదం జరిగి, ఇతర ఆపరేషన్ చేసుకున్నా రూ. లక్ష వరకు వర్తిస్తుం దన్నారు. మహిళలకు ప్రవాసాంధ్ర భరోసా బీమా నమోదు చేసుకున్న 9 నెలల తర్వాత ప్రెగ్నెన్సీ అయి జనరల్ డెలివరీ అయితే రూ.35 వేలు, సిజేరియన్ అయితే రూ. 50 వేలు ఇస్తారని తెలిపారు.

రిమ్స్ పిఎస్‌ను తనిఖీ చేసిన డిఎస్‌పి

ప్రజాశక్తి కడప అర్బన్

నగరంలోని రిమ్స్ పోలీస్ స్టేషన్‌ను కడప డిఎస్‌పి ఎం.డి షరీఫ్ ఆదివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. పరిసరాలు పరిశీలించారు. ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని రిమ్స్ సిఐ కె. రామచంద్రకు సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 'దిశ' రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

అభివృద్ధి, సంక్షేమమే తన లక్ష్యమని, రాజకీయంగా ఉన్నత స్థానాన్ని ఇచ్చిన ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలకు సౌకర్యవంతమైన జీవితం కల్పించడమే తన ముందున్న లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి ఇంట్లో ఆది వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోపవరం పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆధునీకరణమైన పార్కు భూమిపూజ చేసి పనులు ప్రారంభించామన్నారు. రూ.5కోట్లు అంచనా వ్యయంతో ఈ పార్కును పూర్తి చేస్తామన్నారు. ఒక గ్రామపంచాయతీ పరిధిలో ఇంత పెద్దమొత్తాన్ని వెచ్చించి పార్కును ఏర్పాటు చేయడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమమన్నారు. బొల్లవరం శివారు ప్రాంతంలో కాలనీ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. సిఎం జగన్ పుట్టినరోజు ఈనెల 21న పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వైసిపి బలంగా ఉందన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిని తానేనన్నారు. కాని ప్రొద్దు టూరు టిడిపి అభ్యర్థి తానే అని చెప్పుకునే అవకాశం ఇప్పటి వరకు ఎవ్వరికి లేదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి, కాకర్ల నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న వైసిపి నాయకులు

జగనన్నతోనే ప్రజాసంక్షేమం

ప్రజాశక్తి - వేంపల్లె

సిఎం జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎపి హౌస్ హౌస్ డైరెక్టర్ మునీర్ అన్నారు. ఆదివారం స్థానిక 6వ వార్డు తొట్టివీధిలో జగనన్నే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాల వైసిపి పాలనలో సంక్షేమం, అభివృద్ధి జరిగిందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడి ఇంటి ముంగిటికే సంక్షేమ ఫలాలను అందించిన ఘనత సిఎం జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైసిపి పాలన అందిస్తున్నట్లు తెలిపారు. గత టిడిపి ప్రభుత్వం మాటలు తప్ప చేసిందేమి లేదన్నారు. వైసిపి పాలనపై బురదజల్లడమే లక్ష్యంగా, ప్రజలను మరోసారి మోసం చేసేందుకు టిడిపి పన్నాగాలు పన్నుతున్నట్లు చెప్పారు. టిడిపి నాయకులకు మతి భ్రమించిందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ ప్రధాన కార్యదర్శి నిసార్ బాషా, ఎంపిటిసి కటిక చంద్రశేఖర్, వార్డు సభ్యులు బికారి, వెంకటేష్, సచివాలయ కన్వీనర్లు నసీమ్ బాషా, ఆదినారాయణ, గృహసారథులు అంజి, లోకేష్ పాల్గొన్నారు.


బాలికకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బాలికలకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని అంకాలమ్మ పేటలో ఉన్న బిసి సాంఘిక సంక్షేమ బాలిక వసతిగృహంలో ఆదివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 23వ వార్డు కౌన్సిలర్ కొండలరావు, డాక్టర్ స్నేహ ప్రత్యూష, నర్సు సుజాత, ఆశా వర్కర్ సుందరమ్మ, పిఈడి డాక్టర్ సి.బాలానారాయణరావు, సూపరింటెండెంట్ పి.ఆనందరావు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఉమెన్స్ హాస్టల్ వార్డెన్ కె.నాగ సుబ్బమ్మ, ఖాదర్‌బాషా, సంపత్ పాల్గొన్నారు.

మాజీ విఆర్ఓకు నివాళులు

ప్రజాశక్తి - వేంపల్లె


నివాళులర్పిస్తున్న జడ్‌పిటిసి, తులసిరెడ్డి

మండలంలోని టి.వెలమవారిపల్లె గ్రామానికి చెందిన మాజీ విఆర్ఓ వెంకట్రావు(స్వామి) మృత దేహం వద్ద ఆదివారం కాంగ్రెస్, వైసిపి నాయకులు నివాళులర్పించారు. పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, జడ్‌పిటిసి రవి కుమార్‌రెడ్డి నివాళులర్పించి, వెంకట్రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఉమామహేశ్వర్‌రెడ్డి, ఉత్తన్న, బాలం సుబ్బ రాయుడు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్


అదుపుతప్పి బోల్తా పడిన ఆటో

ఆటో బోల్తా : పలువురు కూలీలకు గాయాలు

ప్రజాశక్తి - కాశినాయన

మండల కేంద్రంలోని నరసాపురం సమీపంలో మోడల్ స్కూల్ దగ్గర ఆదివారం ఆటో బోల్తాపడిన సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. రోజూలాగే ఆదివారం నర్సాపురం గ్రామానికి చెందిన కొంతమంది కూలీలు ఆటోలో ఇతర ప్రాంతాలకు పనికి బయల్దేరారు. మోడల్ స్కూల్ సమీపంలోకి రాగానే అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ వంశీ, కూలిపనికి వెళ్లే చిన్న వెంకటమ్మకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే 108 ద్వారా పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొంత మందిని కడప రిమ్స్‌కు పంపారు. నరసాపురంలో కూలీలు ఎక్కువ. వీరికి గ్రామం లోకాని, ఉపాధి చట్టంలోకాని పనుల్లేక ఇతర ప్రాంతాలకు ఆటోలో వెళుతుంటారు. సంఘటనపై ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్షాభావంతో ఎండిపోతున్న మినుము పంట

ఎకరాకు రూ.25వేలు ఖర్చు.. ప్రభుత్వం ఆదుకోవాలి : రైతులు

ప్రజాశక్తి - వేంపల్లె

వర్షాభావంతో సాగులో ఉన్న మినుము (ఉద్ది) పంట ఎండిపోయింది. పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్ట పోయారు. మండలంలోని కత్తులూరు, నందిపల్లి, కుప్పాలపల్లె, రామిరెడ్డిపల్లి, నాగూరు, అయ్యవారిపల్లి, పాములూరు తాళ్లపల్లె, తాటిమాకులపల్లెతోపాటు ఆయా గ్రామాల్లో రబీ సీజన్‌లో రైతులు ఉద్ది పంటను సాగు చేశారు. వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు రబీలో ఈ పంటను సాగు చేశారు. ఉద్ది సాగుతో మంచి ఆదాయం పొందవచ్చని రైతులు ఆశపడ్డారు. వారి ఆశలు నిరాశయ్యాయి. కత్తులూరు గ్రామంలో దాదాపు 400 ఎకరాల్లో అక్టోబర్ మొదటి వారంలో రైతులు ఉద్ది పంటను సాగు చేశారు. పంట సాగైనప్పటి నుండి వర్షాలు కురవలేదు. ఈ నేపథ్యంలో పంట ఎండు దశకు చేరుకుంది. తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్ది పంట 90 రోజుల్లో దిగుబడి వస్తుంది. కత్తులూరు గ్రామానికి చెందిన వెంకట బయపురెడ్డి 30 ఎకరాల్లో, వీరభైరవరెడ్డి 12 ఎకరాలు, రామగంగిరెడ్డి 10 ఎకరాలు, బయపురెడ్డి 3 ఎకరాలు, ప్రతాప్‌రెడ్డి 10 ఎకరాలు, రామచెన్నారెడ్డి 16 ఎకరాలు, వెంకటశివారెడ్డి 10 ఎకరాలు, మరక మల్లయ్య 5 ఎకరాలు, చిట్టిబోయిన గంగన్న 3 ఎకరాలు, వెంకటరెడ్డి 7 ఎకరాల్లో పంటను సాగు చేశారు. పంట సాగు చేసి రెండున్నర నెల అవుతున్నా వర్షం కురవలేదని రైతులు వాపోతున్నారు. పంట కాలం పూర్తయినప్పటికీ వర్షం పడలేదు. పంట చేతికి రాక తాము పూర్తిగా నష్టపోయామని రైతుల్లో ఆందోళన నెలకొంది. మరో వైపు వర్షాలు కురవక సాగు చేసిన ఉద్ది పంటను బుడిద, ఇతర తెగుళ్లు ఆశించాయి. పంట సాగు చేసినప్పటి నుండి వర్షాలు కురుస్తాయానే ఆశతో పంటకు సస్యరక్షణ చేపట్టి, మందులను పిచికారి చేశామని రైతులు పేర్కొంటున్నారు. ఉద్ది పంట సాగుకు ఎకరాకు రూ.25 వేలు ఖర్చు చేశామని రైతులు తెలిపారు. ఖర్చు కూడా రాదని రైతులు వాపోతున్నారు. పంట సాగు చేసినప్పటి నుండి ఒక చుక్క వర్షం పడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్ది పంట దిగుబది రాకపోవడంతో గొర్రెలకు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండిపోయిన ఉద్ది



పంటను మరికొందరు రైతులు ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవక ముఖ్యమంత్రి జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో పూర్తిగా నష్టపోయామని రైతులు అంటున్నారు. వర్షాలు కురవక కరువు ఛాయలు అలుముకున్నాయి. సిఎం జగన్ కరువు మండలంగా ప్రకటించికపోవడం దారుణమని రైతులు అంటున్నారు. నాలుగేళ్లుగా ఒక్క పంట కూడా సరిగా చేతికందడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిఎం జగన్ కరువు లేదని చెప్పడం శోచనీయమని రైతులు పేర్కొంటున్నారు. ఫసల్ బీమా చేయకుండా రూ.2వేలు ఇచ్చి పండుగ చేసుకోండి అని చెప్పడం ప్రభుత్వాలకు సరైంది కాదని రైతులు అంటున్నారు. ఆ డబ్బు ఒక నెల కూరగాయలు కూడా రాదని వాపోతున్నారు. ప్రధాని మోడీ రైతులకు మంచి ఆదాయం కల్పిస్తామని చెప్పారని.. ప్రస్తుతం జగన్, మోడీ కలిసిపోవడంతో చేను బీడుగా మారి పోయిందని రైతులు మండిపడుతున్నారు. రైతుల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ కరువు జిల్లాగా ప్రకటిం చడంతోపాటు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



రబీలో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. రబీలో 12 ఎకరాల్లో ఉద్ది పంటను సాగు చేశారు. సాగు కోసం ఎకరాకు రూ.25 వేలు ఖర్చు చేశారు. వర్షం కురవక పంట పూర్తిగా దెబ్బ తింది. జిల్లాలో కరువు తీవ్రంగా ఉందన్నారు. ఉద్ది పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలి. రైతు ప్రభుత్వమని చెప్పుకునే సిఎం రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

- వీర భైరవరెడ్డి, రైతు, కత్తులూరు

ప్రభుత్వం సాయం చేయాలి



వర్షాభావంతో పంటలు సాగు చేసిన రైతులు పూర్తిగా నష్టపో యారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సా యం చేసి ఆదుకోవాలి. రబీ సీజన్ లో ఉద్ది పం టను 30 ఎకరాల్లో సాగు చేయడం జరిగింది. ఎకరాకు రూ 25 వేలు ఖర్చు చేసి పంట సాగు చేసిన ఫలితం లేదు. వర్షం లేక ఎండి పోయిన పంటను చూస్తే ఆశ నిరాశగా మారి పోయింది. పంటను దక్కించుకోవడానికీ మందులు కొట్టిన ప్రయోజనం లేదు. వర్షాలు సకాలంలో వచ్చి ఉంటే రైతులకు కష్టాలు తప్పేవి. సిఎం జగన్ రైతులను ఆదుకొని అప్పుల నుండి గట్టేక్కించాలి.

- వెంకట బయపురెడ్డి, రైతు, కత్తులూరు.

దౌర్జన్యమే ఎమ్మెల్యే రాచమల్లు అజెండా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)


మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో దౌర్జన్యమే అజెండాగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవలే స్థానిక మహిళా ఎస్ఐపై ఇసుక మాఫియా దాడి చేస్తే బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే ఖండిం చలేకపోవడం బాధాకరమన్నారు. నిందితులను ఇంతవరకు పోలీసులు అదుపులోకి తీసుకోక పోవడం విచారకరమన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసులలో నిందితులను అదుపులోకి తీసుకోవడంలో చూపించే శ్రద్ధ మహిళా ఎస్ఐపై దాడి చేసిన నిందితులపై ఎందుకు చూపడం లేదని ఆయన ప్రశ్నించారు. విందు పేరుతో మున్సిపల్ కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా నేతలను కూడగట్టాడని పత్రికలు కథనాలు రాస్తే ప్రజాస్వామ్య బద్ధంగా ఖండించాల్సిన ఎమ్మెల్యే రాచమల్లు వారి అనుచరులు పత్రికా కార్యాలయాలపై నిరసన వ్యక్తం చేస్తూ పత్రికలు దహనం చేయడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. తనపై అవాస్తవ కథనాలు రాసినప్పుడు తాను ఎమ్మెల్యే రాచమల్లులా వ్యవహరించలేదని తెలిపారు. ఎప్పటికైనా ప్రజా సేవతోనే ప్రజలకు దగ్గర కావాలే తప్ప, దౌర్జన్యంతో కాదని పేర్కొన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే రాచమల్లును ఓడించేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని ప్రవీణ్ తెలిపారు.

స్పందించకపోతే ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆరేడు నెలలుగా జీతాలు లేవని.. పెండింగ్ జీతాలు మంజూరు చేయాలని.. అధికారులను నాలుగు రోజులుగా మొర పెట్టుకుంటున్నా కనికరించడంలేదని.. ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళనా కార్యక్రమాలు ఉధృతం చేస్తామని క్లాప్‌డ్రైవర్లు హెచ్చరించారు. నాల్గవ రోజు ఆదివారం సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శనతో మూడవ సచివాలయం వద్ద దర్నా చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పెండిగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. జిఒ నెంబర్7 ప్రకారం రూ.18,500 వేతనం వర్తింపజేయాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా చెల్లించాలన్నారు. డ్రైవర్లకు సెలవులు మంజూరు చేయాలన్నారు. మరమ్మతులకు గురైన వాహనాలను రిపేరి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సంఘ కార్యదర్శి సాల్మన్, సంఘ నాయకురాలు గుర్రమ్మ, రాజ్‌కుమార్, నరేష్, కిరణ్‌బాబు, పవన్, భాస్కర్‌రావు, రాజేష్, సునీల్, వెంకటేశ్ పాల్గొన్నారు.


అర్ధనగ్న ప్రదర్శనలో కార్మికులు

జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు విజయవంతం


ప్రశంసాపత్రాలతో విజేతలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టివిఆర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు విజయ వంతమయ్యాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి 50మంది క్రీడ కారులు విచ్చేశారు. 16సంవత్సరములలోపు బాలురు (2కి.మీ) గంగాధర్, 18లోపు బాలురు (6కి.మీ) నవరాజు, భానుప్రకాష్‌రెడ్డి, విష్ణు, బ్రహ్మం, పురుషులు (10కి.మీ) సింహాచలం, 16లోపు బాలికలు (2కి.మీ) అశ్విని గెలుపొందినట్లు ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్‌బాషా తెలిపారు. వీరు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 24న కాకినాడ జిల్లా సామర్లకోటలో జరగబోయే రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ (దూరపు పరుగు పందెం) పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ క్రీడా పోటీలలో వ్యాయామ సంచాలకులు వెంకట సుబ్బయ్య, అంకారావు, చరణ్‌కుమార్‌రెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు. జిల్లా అథ్లెటిక్స్ ఫౌండేషన్ సంఘం అధ్యక్షులు బసిరెడ్డి వీరకళ్యాణ్‌రెడ్డి సహకరించినందుకు అహ్మర్‌బాషా ధన్యవాదాలు తెలిపారు.

రేపు జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్

ప్రజాశక్తి - చాపాడు

జిల్లా సైన్స్‌పెయిర్ పోటీలను మంగళవారం మండల పరిధిలో పల్లవోటు వద్దనున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్లు మండల విద్యాశాకాధికారి రవిశంకర్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాల నుండి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మండలస్థాయి పోటీలను నిర్వహించి ప్రాజెక్టులను ఎంపిక చేశారన్నారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు హాజరవుతారని ఆయన వివరించారు. ఆ మేరకు అన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంఇఒ రవిశంకర్ కోరారు.

ఆశాజనకంగా జొన్న పంట

ప్రజాశక్తి - చాపాడు

ఈ ఏడాది జొన్న పంట ఆశాజనకంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. గత రెండు సంవత్సరాలుగా మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించి దిగుబడి పూర్తిగా తగ్గుముఖం పట్టింది. కత్తెర పురుగు దెబ్బకు జొన్న, మొక్కజొన్న పంటల సాగు గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ఈ ఏడాది మండల పరిధిలో రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు రైతులు అధికంగా సాగు చేశారు. దాదాపు 11వేల ఎకరాల్లో మినుము, జొన్న పంటలను రైతులు సాగు చేశారు. జొన్న పంట ప్రస్తుతం కంకులు వేసే దశకు చేరుకుంది. ఎకరాకు సాధారణంగా 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్రాసింగ్ జొన్న అయితే 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం క్వింటా జొన్నల ధర రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు ధర ఉంది. జొన్న పంట జనవరి రెండవ వారానికి నూర్పిడి పూర్తవుతుంది. మండల పరిధిలో సిద్దారెడ్డిపల్లె, సోమాపురం, బద్రిపల్లె, విశ్వనాధపురం, జడ్జిగారికొట్టాల, చెంచుపల్లి, చండ్లూరు, మదూరు గ్రామాల పరిధిలో సాగులో ఉంది.


కంకులు వేసే దశలో జొన్న పంట



పురస్కారం అందుకుంటున్న రఘునాథరెడ్డి

రఘునాథరెడ్డికి విశిష్ట పురస్కారం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వైసిపి కేంద్ర కార్యాలయ ఆవరణలో పార్టీ విభిన్నప్రతిభావంతుల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్రంలో వారి సంక్షేమం కోసం కృషి చేస్తున కొంతమంది నాయకులను ఘనంగా సన్మానించారు. విశిష్ట పురస్కారాలు అందజేశారు. వైఎస్ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలో విభిన్నప్రతిభావంతుల సంక్షేమం కోసం గత మూడు దశాబ్దాలుగా కృషి చేస్తున్న ఎపి విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి సేవలకు గుర్తింపుగా సన్మానించారు. శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత ఆయనను ఘనంగా సత్కరించి, విశిష్ట పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి విభిన్నప్రతిభావంతుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు బందెల కిరణ్‌రాజ్, వైసిపి గ్రీవెన్స్ సెల్ విభాగం రాష్ట్ర చైర్మన్ అంకంరాజు నారాయణమూర్తి, వైసిపి రైతువిభాగం అధ్యక్షులు నాగిరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు గీత, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన పలువురు నాయకులు పాల్గొన్నారు.


నాలుగు రోడ్ల కూడలిలో కేక్ కట్ చేస్తున్న వైసిపి నేతలు

ఘనంగా షర్మిల పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం తెలంగాణ వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపిటిసి, వైసిపి బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి భారతి ఆధ్వర్యంలో వైసిపి నాయకుల మధ్య కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. షర్మిలారెడ్డి పుట్టినరోజు వేడుకలను నిర్వహించడం సంతోషంగా ఉందని భారతి చెప్పారు. కార్యక్రమంలో వైసిపికి చెందిన గనుల శాఖ డైరెక్టర్ సల్మా, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ కొండయ్య, గండి దేవస్థానం చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్, మైనార్టీ నాయకుడు సాదక్ వలి, కమతం రాజా, వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కుర్రాకుల వెంకటేష్, కుమ్మరాంపల్లె సర్పంచ్ మునేష్, మదార్ షా వలి, గౌస్, గణేష్ పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

పులివెందుల టౌన్ : స్థానిక నగిరిగుట్టలో ఉన్న నిరాశ్రయుల వసతి గృహంలో వైఎస్ఆర్‌టిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, దాసరి జయరమేష్ పుట్టినరోజును పురస్కరించుకొని ఆదివారం వైసిపి నాయకుడు ఈశ్వరయ్య మాంసాహార విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షర్మిల పుట్టినరోజు సందర్భంగా ప్రతి పుట్టినరోజుకు ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.


అన్నదానం చేస్తున్న చైర్మన్ గోటూరు చిన్నప్ప

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అన్నదానం చాలా సంతోషకరమని మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గోటూరు చిన్నప్ప తెలిపారు. పట్టణంలోని సెంటెన్స్ స్కూల్‌లో ఉన్న చర్చిలో గోటూరు ఓబన్న పేరు మీద ఆయన కుమారుడు చిన్నప్ప ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెంటెన్స్ స్కూల్ చర్చిలో మాంసాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే సెంటెన్స్ స్కూల్‌లో ఉన్న పిల్లలకు, చర్చికి వచ్చే వారికి స్నేహితులకు, బంధువులకు, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

రాజధానిలేని ఏకైక రాష్ట్రం ఎపి

పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల ప్రకటన చేసి చారిత్రక తప్పిదం చేసినట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 17న రాష్ట్ర చరిత్రలో ఒక దుర్దినమన్నారు. దీని ఫలితంగా దేశంలో ఆంధ్రప్రదేశ్ రాజధానిలేని ఏకైక రాష్ట్రంగా తయారైందని తెలిపారు. రాష్ట్ర ప్రగతి ఆగిపోయిందన్నారు. ఇది ఒక పిచ్చి తుగ్లక్ చర్య అన్నారు. ఈ ఒక్క కారణం చాలు రాబోవు ఎన్నికల్లో వైసిపిని ఓడించడానికి అన్నారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అదే అమరావతి, ఇదే కాంగ్రెస్ విధానం, నినాదమన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన వైఎస్ఆర్‌టిఎ నేతలు

పులివెందుల టౌన్ : తూర్పు రాయలసీమ (నెల్లూరు–ప్రకాశం–చిత్తూరు) ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు పర్వ తనేని చంద్రశేఖర్‌రెడ్డిని నెల్లూరులో ఆయన కార్యాలయంలో ఆదివారం వైఎస్ ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సికె వెంకట్‌నాథ్‌రెడ్డి, సికె చరణ్ కుమార్‌రెడ్డి, ప్రకాశం జిల్లా వైఎస్ ఆర్ టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. జ్ఞాపికను అందజేశారు.